సత్వర పరిష్కారం చూపాలి



సమస్యలు పరిష్కరించాలని ఎమ్మెల్యే ముఠా గోపాల్‌కు వినతిపత్రం అందజేస్తున్న స్థానికులు

- జలమండలి అధికారులకు ముషీరాబాద్ ఎమ్మెల్యే ముఠా గోపాల్ ఆదేశం

ముషీరాబాద్, నవంబర్ 16: ప్రజల నుంచి వచ్చే ఫిర్యాదులను త్వరితగతిన పరిష్కరించాలని ముషీరాబాద్ ఎమ్మెల్యే ముఠా గోపాల్ జలమండలి అధికారులను ఆదేశించారు. శనివారం అడిక్‌మెట్ డివిజన్ సత్యానగర్‌లో రూ.5.5లక్షల వ్యయంతో చేపట్టనున్న డ్రైనేజీ పైపులైన్ నిర్మాణ పనులను ఆయన ప్రారంభించారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ కలుషిత నీరు, డ్రైనేజీ సమస్యల పరిష్కారానికి తగిన చర్యలు తీసుకోవాలని సూచించారు. రెండు దశాబ్దాలుగా డ్రైనేజీ పైపులైన్ల సమస్యలను పట్టించుకోకపోవడం వల్లనే లీకేజీ సమస్యలు తీవ్రమవుతున్నాయని అన్నారు. దశలవారీగా పెండింగ్ సమస్యలను పరిష్కరిస్తానని పేర్కొన్నారు. గతంలో ఏ ఎమ్మెల్యే చేయని విధంగా నియోజకవర్గాన్ని అన్నిరంగాల్లో అభివృద్ధి పథంలో ముందుకు తీసుకువెళ్తున్నామని అన్నారు. ఇటీవల డ్రైనేజీ సమస్యల పరిష్కారం కోసం పెద్ద ఎత్తున నిధులు వెచ్చించి పనులు చేపడుతున్నట్టు చెప్పారు. ఈ కార్యక్రమంలో సురేందర్, మాధవ్, రవియాదవ్, బొట్టు శ్రీనివాస్, నేత శ్రీనివాస్, సయ్యద్ అస్లాం, ముచ్చకుర్తి ప్రభాకర్, ప్రసన్న, అనురాధ, ఎర్రం శ్రీనివాస్, ప్రేమ్‌కుమార్, రామస్వామి, అబ్బు, సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించాలని వినతి

అడిక్‌మెట్ డివిజన్ బాపూజీనగర్‌లో సమస్యలు పరిష్కరించాలని కోరుతూ స్థానికులు ఎమ్మెల్యే ముఠా గోపాల్‌కు వినతి పత్రం సమర్పించారు. కాలనీ రోడ్డు నిర్మాణం, చెట్ల కొమ్మల తొలగింపు, ట్రాన్స్‌ఫార్మర్ తరలింపు పనులు చేపట్టాలని స్థానికులు మహావిష్ణు, గౌరీనాథ్‌శాస్త్రి, బలరాం, రామ్మోహన్ నవీన్, సాయిప్రసన్న, మాధవ్, బబ్లు కోరారు. సదరు సమస్యల పరిష్కారానికి వెంటనే తగిన చర్యలు తీసుకోనున్నట్టు ఎమ్మెల్యే తెలిపారు.

కేటీఆర్‌ను అరెస్ట్ చేసే కుట్ర

బీఆర్ఎస్ యువ నేత ముఠా జయసింహ

చిక్కడపల్లి, నవంబర్ 1: ప్రజల పక్షాన నిలబడి ప్రశ్నిస్తున్న బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ మంత్రి కేటీఆర్‌ను ప్రభుత్వం అరెస్ట్ చేసే కుట్ర చేస్తున్నదని బీఆర్ఎస్ యువ నేత ముఠా జయసింహ అన్నారు. శనివారం గాంధీనగర్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రభుత్వ వైఫల్యాలను ఎండగడుతున్న కేటీఆర్ నిర్బంధానికి రేవంత్ సర్కారు కుట్ర చేస్తున్నదని ఆరోపించారు. రాష్ట్రంలో ప్రజల పక్షాన, మూసీ బాధితులు ,అదే విధంగా లగచర్ల బాధితుల పక్షాన కేటీఆర్ పోరాటం చేస్తున్నారని, ప్రశ్నిస్తున్నారని దీంతో ప్రభుత్వానికి భయం పట్టుకున్నదన్నారు.

డీడీఎంఎస్‌లో వివిధ వొకేషనల్ కోర్సులకు దరఖాస్తుల ఆహ్వానం

ఉస్మానియా యూనివర్సిటీ, నవంబర్ 16: దుర్గాబాయ్ దేశ్‌ముఖ్ మహిళా సభ వొకేషనల్ కోర్స్ సెంటర్‌లో పలు కోర్సులకు దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్టు అధికారులు ఒక ప్రకటనలో తెలిపారు. ఫార్మసీ అసిస్టెంట్, హెల్త్‌కేర్ మల్టీపర్పస్ వర్కర్ (నర్స్ కోర్స్), ఆపరేషన్ థియేటర్ టెక్నీషియన్, డయాలసిస్ అసిస్టెంట్, ప్రీ ప్రైమరీ టీచర్ ట్రైనింగ్ సర్టిఫికెట్ కోర్సుల్లో చేరేందుకు కనీస అర్హత 10వ తరగతి అని తెలిపారు. రెస్పిరేటరీ థెరపీ, ఈసీజీ, మెడికల్ ల్యాబ్, కార్డియాలజీ టెక్నీషియన్స్, రేడియోగ్రఫీ అసిస్టెంట్ వంటి పారా మెడికల్ డిప్లొమా కోర్సుల్లో చేరేందుకు కనీస అర్హత ఇంటర్మీడియట్ అని చెప్పారు. అన్ని వయసుల వారు కోర్సుల్లో చేరేందుకు అర్హులని పేర్కొన్నారు. కోర్సుల్లో చేరేందుకు ఈనెల 30 ఆఖరు అని అన్నారు. ఆసక్తి ఉన్న అభ్యర్థులు ఆలోగా దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ఇతర వివరాలకు 83090 37134, 63058 95867 నంబర్లలో సంప్రదించాలని సూచించారు.

వ్యవసాయ అధికారులకు పదోన్నతులివ్వాలి

సమావేశంలో మాట్లాడుతున్న సంఘం చైర్మన్ బి.కృపాకర్‌రెడ్డి

చిక్కడపల్లి, నవంబర్ 16: రాష్ట్ర ఆర్థిక వ్యవస్థకు మూలాధారమైన వ్యవసాయ రంగానికి, వ్యవసాయ దారులకు సేవలు అందిస్తున్న వ్యవసాయ అధికారులకు పదోన్నతులు కల్పించాలని, వ్యవసాయ అధికారులకు సంఘం చైర్మన్ బి.కృపాకర్‌రెడ్డి అన్నారు. సోమవారం సాయంత్రం సుందరయ్య విజ్ఞాన కేంద్రలో సంఘం సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దశాబ్దానికి పైగా వ్యవసాయ శాఖలో పదోన్నతులు లేకపోవడం, ఖాళీలు ఉన్నాకూడా పదోన్నతులు చేపట్టక పోవడం బాధాకరమని అన్నారు. ప్రభుత్వం తమ సమస్యలను పరిష్కరించాలని అన్నారు. సంఘం అధ్యక్షుడు డాక్టర్ వైద్యనాథ్, ప్రధాన కార్యదర్శి జి.కృపాకర్‌రెడ్డి, అసోసియేట్ ప్రెసిడెంట్ కాంతారావు, కోశాధికారి రవీందర్‌రెడ్డి, ఉపాధ్యక్షుడు శశిధర్ రెడ్డి, వైస్‌చైర్మన్ అనురాధ, మహేందర్‌రెడ్డి, ఎస్.శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

ఉత్తమ ఉపాధ్యాయ పురస్కారం

ముషీరాబాద్, నవంబర్ 16: సాహితీ జిగీష సాహిత్య, సాంస్కృతిక సంస్థ ఆధ్వర్యంలో బాలల దినోత్సవం సందర్భంగా శనివారం చిక్కడపల్లి త్యాగరాయ గానసభలో పౌరాణిక క్విజ్-పాఠశాల విజేతలకు బహుమతుల ప్రదానోత్సవం జరిగింది. ఎస్ఐ ఆఫ్ పోలీసు పెద్దూరి వేంకటదాసు ముఖ్య అతిథిగా పాల్గొని ఉత్తమ ఉపాధ్యాయ పురస్కారాన్ని బండారుపల్లి రామచంద్రరావుకు అందజేశారు. ప్రముఖ కవి రఘుశ్రీ అధ్యక్షత జరిగిన కార్యక్రమంలో నిష్ఠల గోపాలకృష్ణ, సాహితీ జిగీష వ్యవస్థాపకురాలు డాక్టర్ పులిగడ్డ విజయలక్ష్మి, ఉమాశశి, కార్యదర్శి పులిగడ్డ లలితవాణి, తదితరులు పాల్గొన్నారు.

బండారుపల్లి రామచంద్ర రావుకు పురస్కారాన్ని అందజేస్తున్న రఘుశ్రీ, పెద్దూరి వేంకటదాసు, తదితరులు

విద్యుత్ ఆర్టిసన్ సమస్యలు పరిస్కరిస్తాం

సికింద్రాబాద్ ఎమ్మెల్యే పద్మారావుగౌడ్

సికింద్రాబాద్ ఎమ్మెల్యే తీగుల్ల పద్మారావుగౌడ్‌ను కలిసిన తెలంగాణ విద్యుత్ ఆర్టిసన్ జేఏసీ బృందం

సికింద్రాబాద్, నవంబర్ 16: తెలంగాణ విద్యుత్ ఆర్టిసన్ జేఏసీ బృందం శనివారం సికింద్రాబాద్ ఎమ్మెల్యే తీగుల్ల పద్మారావు గౌడ్‌తో సమావేశమైంది. సీతాఫల్‌మండిలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో పద్మారావుగౌడ్‌ను కలిసి తమ డిమాండ్ల పరిష్కారానికి సహకరించాలని విజ్ఞప్తి చేసింది. ఈ మేరకు ఓ వినతి పత్రాన్ని ఎమ్మెల్యే పద్మారావుగౌడ్‌కు అందించారు. వారి సమస్యల పరిష్కారానికి తన వంతు కృషి చేస్తానని ఎమ్మెల్యే ఈ సందర్భంగా పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో జేఏసీ చైర్మన్ మోహన్, నేతలు ఆసిఫ్, నర్సింగ్, రమేశ్ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు కంటి అద్దాల పంపిణీ

విద్యార్థులకు కంటి అద్దాలను అందజేస్తున్న క్లబ్ ప్రతినిధులు

అడ్డగుట్ట, నవంబర్ 16: మెట్టుగూడ దూద్‌బాబి ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో రోటరీ క్లబ్ ఆఫ్ జూబ్లీహిల్స్ ఆధ్వర్యంలో శనివారం విద్యార్థులకు, వారి తల్లిదండ్రులకు కంటి అద్దాలను పంపిణీ చేశారు. గత నెలలో పుష్పగిరి విట్రో రెటీన ఇన్‌స్టిట్యూట్ ప్రతినిధులు పాఠశాల విద్యార్థులకు, తల్లిదండ్రులకు కంటి పరీక్షలను నిర్వహించారు. వారికి శనివారం అద్దాలను అందజేశారు. అదేవిధంగా పాఠశాల విద్యార్థుల మధ్యాహ్న భోజన నిమిత్తం 50 ప్లేట్లను కూడా అందజేసినట్టు క్లబ్ ప్రతినిధులు తెలిపారు. రోటరీ క్లబ్, పుష్పగిరి విట్రో రెటీన ఇన్‌స్టిట్యూట్ ప్రతినిధులకు పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులు కృతజ్ఞతలను తెలియజేశారు. కార్యక్రమంలో క్లబ్ ప్రతినిధులు ప్రదీప్, పాఠశాల ప్రధానోపాధ్యాయుడు మల్లి కార్జున్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

శాంతిభద్రతల పరిరక్షణ ప్రతిఒక్కరి బాధ్యత

సీసీ కెమెరాలను ప్రారంభిస్తున్న ముషీరాబాద్ ఇన్‌స్పెక్టర్ రాంబాబు

ముషీరాబాద్, నవంబర్ 16: శాంతిభద్రతల పరిరక్షణకు ప్రతిఒక్కరి బాధ్యత కావాలని ముషీరాబాద్ ఇన్‌స్పెక్టర్ రాంబాబు అన్నారు. శనివారం భోలక్‌పూర్ డివిజన్ బాకారంలోని బ్రమరాంబ మల్లికార్జున స్వామి ఆలయంలో ఏర్పాటు చేసిన సీసీ కెమెరాలను ఆయన ప్రారంభించారు. అనంతరం మాట్లాడుతూ నేరాలు అరికట్టడానికి సీసీ కెమెరాల ఏర్పాటు తప్పనిసరి అని, ప్రతి సంస్థ, మందిరాల వద్ద సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలన్నారు. ఆలయ మేనేజింగ్ ట్రస్టీ నల్లబెల్లి అంజిరెడ్డి ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో ఆలయ చైర్మన్ నల్లబెల్లి ఊర్మిళ, మల్లికార్జునరెడ్డి, ఎస్.యాదగిరి, రమణారెడ్డి, ఆర్.సురేశ్, సి.రఘు, ముషీరాబాద్ ఎస్ఐ శివప్రసాద్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

వాయిస్ అండ్ స్పీచ్ వర్క్‌షాపు



వాయిస్ అండ్ స్పీచ్ వర్క్‌షాప్‌లో పాల్గొన్న రచయిత గరికపాటి ఉదయభాను

మారేడ్‌పల్లి, నవంబర్ 16: స్వరం ఒక వరం అంటూ.. సురభి కళాక్షేత్రమ్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న వాయిస్ అండ్ స్పీచ్ వర్క్‌షాపు-10వ బ్యాచ్ సికింద్రాబాద్‌లోని అవర్ సాక్రేడ్ స్పేస్‌లో శనివారం ప్రారంభమైంది. ముఖ్యఅతిథిగా ప్రముఖ నాటక దర్శక రచయిత గరికపాటి ఉదయభాను హాజరై ప్రసంగించారు. వ్యక్తి భావవ్యక్తీకరణకు బాడీ లాంగ్వేజ్, వాయిస్ ప్రధాన కారకాలు అన్నారు. ఈ వర్క్‌షాపులు విదేశాల్లో ఉన్నాయని, మన దేశంలో కూడా విద్యావ్యవస్థలో భాగమవ్వాలని అన్నారు. 30 రోజుల ట్రైనింగ్‌లో భాగంగా స్టోరీ టెల్లింగ్, పబ్లిక్ స్పీకింగ్, స్టేజ్ యాంకరింగ్, రేడియో, టీవీ ప్రజెంటేషన్, పాడ్ కాస్టింగ్, న్యూస్ రీడింగ్, డబ్బింగ్ అంశాల్లో నిపుణులు శిక్షణ ఇవ్వనున్నారు. వివరాల కోసం 94904 23885 నంబర్‌ను సంప్రదించాలని సూచించారు. కార్యక్రమంలో ప్రముఖ వ్యాఖ్యాత వాచస్పతి, అంబడిపూడి మురళీకృష్ణ, వర్క్‌షాపు డైరెక్టర్ డాక్టర్ సురభి రమేశ్, డాక్టర్ మామిడి హరికృష్ణ, స్వాతి పాల్గొన్నారు.

పాఠశాలల అభివృద్ధికి ముందుకు రావాలి

మన్సూరాబాద్, నవంబర్ 16: పేద ప్రజలు విద్యనభ్యసించే ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధి కోసం దాతలు ముందుకు రావాలని ఉప్పల మండల విద్యాధికారి రామారావు కోరారు. నాగోల్ డివిజన్ పరిధి జైపురి కాలనీలోని ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల అభివృద్ధి కోసం సంగారెడ్డి జిల్లా కల్లేరు ఎంఈవో గంజి శ్రీనివాస్, విశ్రాంత ప్రధానోపాధ్యాయులు ప్రభాకర్‌రెడ్డి, ఉపాధ్యాయుడు మల్లేశ్ రూ. 8 వేల చెక్కును ప్రధానోపాధ్యాయుడు బత్తుల శ్రీనివాస్‌కు అందజేశారు. ఈ సందర్భంగా ఎంఈవో రామారావు మాట్లాడుతూ క్వాలిఫైడ్ టీచర్ల విద్యాబోధనలు చేస్తున్న ప్రభుత్వ పాఠశాలల్లో చదివే విద్యార్థులు ఎంతో మంది ఉన్నతమైన స్థానాల్లో ఉన్నారన్నారు. ఈ కార్యక్రమంలో అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీ చైర్‌పర్సన్ వరలక్ష్మి, ఉపాధ్యాయులు బ్యాల పాల్గొన్నారు.

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

చిక్కడపల్లి, నవంబర్ 16: సైఫాబాద్ డివిజన్ పరిధిలో విద్యుత్‌లైన్ మరమ్మతులు, ట్రీ కటింగ్ కారణంగా విద్యుత్ సరఫరాను నిలిపివేస్తున్నట్లు ఆజామాబాద్ డివిజన్ ఏడీఈ వినోద్ కుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. ఎర్రమజిల్ సబ్ స్టేషన్ పరిధిలో ఉదయం 10 నుంచి ఒంటి గంట వరకు ఎర్రమజిల్ సబ్ స్టేషన్ పరిధిలోని సంగీత్ ఏరియా, కపాడియా లేన్ ఏరియా, రెడ్ రోజ్ హోటల్ ఏరియా, సవిల్ సప్లై లేన్, ఎర్రమంజిల్ తదితర ప్రాంతంలో విద్యుత్ నిలిపివేస్తారు. మధ్యాహ్నం 2 గంటల నుంచి సాయంత్రం 5 వరకు ఎర్రమంజిల్‌కాలనీ, రవీంద్ర నికేతన్ స్కూల్ ఏరియా, పీబీ ఆఫీస్ ఏరియా, హేరిటేజ్ లైన్, పజాగుట్ట, ఐసీ క్వార్టర్స్, నిమ్స్ ప్రధాన రహదారి తదితర ప్రాంతాల్లో విద్యుత్ నిలిపివేస్తారు. ఎగ్జిబిషన్ సబ్ స్టేషన్ పరిధిలోని 10 నుంచి ఒంటి గంట వరకు అదేవిధంగా జగదీష్ మార్కెట్ ఏరియా, కరీమాబాద్ ఏరియా, పరిశ్రమ డైరెక్టర్ ఏరియా తదితర ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా నిలివేస్తారు. నిజాం కళాశాల సబ్ స్టేషన్ పరిధిలో మధ్యాహ్నం 2 గంటల నుంచి 5 వరకు లిటిల్ ఫ్లవర్ ఏరియా స్కూల్, లక్ష్మి టాకిస్ ఏరియా, మహేశ్‌నగర్, మెడ్విన్ హాస్పిటల్ లేన్, డైరెక్టర్ ఆఫ్ ఫైనాన్స్ ప్రాంతం, డీసీబీ బ్యాంక్ ప్రాంతంలో విద్యుత్ సరఫరాను నిలిపివేస్తారు. ఎగ్జిబిషన్ సబ్ స్టేషన్ పరిధిలోని మధ్యాహ్నం 2 గంటల నుంచి 5 వరకు చంద్రవిహార్ ప్రాంతం, కేర్ హాస్పటిల, ఏసీబీ కార్యాలయం, సియాసత్ కార్యాలయం, డాక్ సదన్ కార్యాలయం తదితర ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా నిలిపివేస్తారు.

ముస్లిం శ్మశానవాటిక పనులు వేగవంతం

గోల్నాక, నవంబర్ 16 : ముస్లిం శ్మశాన వాటిక పనులను వేగవంతం చేశామని అంబర్‌పేట డివిజన్ కార్పొరేటర్ విజయ్ కుమార్‌గౌడ్ తెలిపారు. అంబర్‌పేట అలీకేఫ్ చౌరస్తా నుంచి నాగోల్ వెళ్లే కొత్త రహదారిలో ఏర్పాటు చేస్తున్న ముస్లిం శ్మశాన వాటిక పనులను శనివారం స్థానిక ముస్లిం నాయకులతో కలసి ఆయన పరిశీలించారు. ఇప్పటికే శ్మశాన వాటిక ప్రహరీ నిర్మాణం పూర్తయ్యిందని, మౌలిక సదుపాయాలు కల్పించి త్వరలోనే అందుబాటులోకి తీసుకొస్తామన్నారు.

ఏఎంఎస్‌లో ఘనంగా గ్రాడ్యుయేషన్ డే

పట్టాలు పొందిన విద్యార్థినులతో అతిథులు, అధ్యాపకులు

ఉస్మానియా యూనివర్సిటీ, నవంబర్ 16: ఓయూ క్యాంపస్‌లోని ఆంధ్రమహిళా సభ స్కూల్ ఆఫ్ ఇన్ఫర్మేటిక్స్ 17వ గ్రాడ్యుయేషన్ డే శనివారం ఘనంగా నిర్వహించారు. 2022-2024 విద్యాసంవత్సరాల్లో ఎంబీఏ పూర్తిచేసిన వారికి పట్టాలు ప్రదానం చేశారు. ముఖ్యఅతిథిగా ఓయూ ఇంజినీరింగ్ కళాశాలలోని సివిల్ ఇంజినీరింగ్ విభాగం హెడ్ ప్రొఫెసర్ కేఎల్ రాధిక హాజరయ్యారు. ఆమె మాట్లాడుతూ విద్యార్థినులు భవిష్యత్తులో ఉన్నతంగా ఎదగాలని సూచించారు. విద్యార్థినులు తమ కోర్సు పాఠ్యప్రణాళికతో పాటు నైపుణ్యాలను పెంపొందించుకోవాలని పిలుపునిచ్చారు. తద్వారా ప్రస్తుత పోటీప్రపంచంలో ఉపాధి అవకాశాలు విస్తృతంగా పొందవచ్చున్నారు. ఉన్నత లక్ష్యాలను నిర్దేశించుకొని, సాధనకు శ్రమించాలని సూచించారు. పట్టాతో జీవితంలో విద్యార్థినులు ఒక మైలురాయికి చేరినట్లైందని చెప్పారు. విద్యార్థినులు తమను తాము ప్రశ్నించుకుంటూ, ఈ స్థాయికి చేరుకునేందుకు తోడ్పడిన తల్లిదండ్రులు, ఆచార్యులు, అందరికీ కృతజ్ఞతలు తెలిపాలని అన్నారు. ఏఎంఎస్ వ్యవస్థాపకురాలు దుర్గాబాయ్ దేశ్‌ముఖ్ ఆశయాన్ని ప్రతిబింబించేలా ఉన్నత స్థాయికి చేరుకునేవరకు విశ్రమించరాదన్నారు. ప్రత్యేక అతిథిగా హాజరైన బేకమ్ ఇన్‌ఫ్రా ప్రాజెక్ట్స్ ప్రైవేట్ లిమిటెడ్ సీఎఫ్‌వో డాక్టర్ ఎన్.కిశోర్ మాట్లాడుతూ విద్యార్థినులను అభినందించారు. అన్నింటినీ తమకు తోచిన విధంగా కాకుండా ప్రతిదానిని అర్థవంతంగా జాగరూకతతో తెలుసుకుంటూ విధిని నిర్వహించాలన్నారు. కళాశాల చైర్‌పర్సన్ డాక్టర్ రమాదేవి మాట్లాడుతూ జీవితంలో ఒడిదుడుకులు సహజమని అన్నారు. అలాంటి సమయంలో కూడా మీ ఏకాగ్రత, పట్టుదలతో లక్ష్యాన్ని చేరుకోవాలని చెప్పారు. కార్యక్రమంలో భాగంగా అత్యుత్తమ ప్రతిభ చూపిన వారికి బంగారు పతకాలు ప్రదర్శించారు. కార్యక్రమంలో దుర్గాబాయ్ దేశ్‌ముఖ్ మహిళా సభ (డీడీఎంఎస్) చైర్‌పర్సన్ ఉషా కందా, కళాశాల సెక్రెటరీ వై.సత్యనారాయణ, డైరెక్టర్ ప్రొఫెసర్ కె.విజయలక్ష్మి, అధ్యాపకులు, విద్యార్థినులు, వారి తల్లిదండ్రులు పాల్గొన్నారు.

ఉచిత వైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలి

ఉచిత శిబిరంలో ట్విన్‌సిటీస్ వాకర్స్ క్లబ్ అధ్యక్షుడు కందూరి కృష్ణ

చిక్కడపల్లి, నవంబర్ 1: ఉచిత వైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలని ట్విన్‌సిటీస్ వాకర్స్ క్లబ్ అధ్యక్షుడు కందూరి కృష్ణ అన్నారు. ట్విన్‌సిటీస్ వాకర్స్ క్లబ్ ఆధ్వర్యంలో శనివారం వీఎస్‌టీ పార్క్‌లో ఉచిత వైద్య శిబిరాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా కృష్ణ మాట్లాడుతూ శిబిరానికి మంచి స్పందన వచ్చిందని తెలిపారు. శిబిరంలో వైద్యులు బీపీ, షుగర్ పరీక్షలు నిర్వహించి తగిన సూచనలు చేశారు. కార్యక్రమంలో ఇన్‌కంట్యాక్స్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ హెచ్.గోవింద్, వాటర్ ఇంటర్నేషనల్ మాజీ అధ్యక్షుడు నాగభూషణం, మురళీధరుడు, నరేందర్‌రెడ్డి పాల్గొన్నారు.

విద్యార్థినులకు సైకిళ్ల అందజేత

విద్యార్థినులకు సైకిళ్లు పంపిణీ చేస్తున్న రోటరీ క్లబ్ ఆఫ్ జూబ్లీహిల్స్ అధ్యక్షుడు

జూబ్లీహిల్స్,నవంబర్16: ప్రభుత్వ పాఠశాలల్లో పేద విద్యార్థుల విద్యాభ్యున్నతికి అవసరమైన సహకారం అందిస్తున్నామని రోటరీ క్లబ్ ఆఫ్ జూబ్లీహిల్స్ అధ్యక్షుడు బాలకోటి రెడ్డి పేర్కొన్నారు. శనివారం బొమ్మల రామారం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో రోటరీ క్లబ్ ఆఫ్ జూబ్లీహిల్స్ ఆధ్వర్యంలో రొటేరియన్ సెక్రటరీ వెంకటేష్‌తో కలిసి విద్యార్థినులకు సైకిళ్లను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో పాఠశాల హెచ్ఎం వరలక్ష్మి, ఎంఈఓ రోజారాణి, మహేశ్, సుహాసిని, విజయభారతి, జగన్ పాల్గొన్నారు.

బాధ్యతలు స్వీకరించిన వివిధ కళాశాలల నూతన ప్రిన్సిపాల్స్

ఉస్మానియా యూనివర్సిటీ, నవంబర్ 16: ఉస్మానియా యూనివర్సిటీ పరిధిలోని వివిధ కళాశాలలకు ప్రిన్సిపాల్స్, కంట్రోలర్ ఆఫ్ ది ఎగ్జామినేషన్స్ పదవుల్లో కొత్త వారిని నియమించిన నేపథ్యంలో వారు శనివారం బాధ్యతలు స్వీకరించారు. ఆర్ట్స్ కళాశాల ప్రిన్సిపాల్‌గా ప్రొఫెసర్ కాసిం, సైన్స్ కళాశాల ప్రిన్సిపాల్‌గా ప్రొఫెసర్ జి.ప్రభాకర్, కామర్స్ అండ్ బిజినెస్ మేనేజ్‌మెంట్ కళాశాల ప్రిన్సిపాల్‌గా ప్రొఫెసర్ ఐ.శేఖర్, లా కళాశాల ప్రిన్సిపాల్‌గా డాక్టర్ రాంప్రసాద్ బాధ్యతలు అందుకున్నారు. ఈ సందర్భంగా వారిని పలువురు అధికారులు, అధ్యాపకులు, పరిశోధక విద్యార్థులు, వివిధ విద్యార్థి సంఘాల నాయకులు అభినందించారు.

మధుమేహ సమస్యలపై నేడు అవగాహన

సికింద్రాబాద్, నవంబర్ 16: మధుమేహ నివారణ దినోత్సవం సందర్భంగా వారాసిగూడలోని సుజాత ఐ కేర్ సెంటర్ ఆధ్వర్యంలో నేడు 13వ ఉచిత మధుమేహ సమస్యల అవగాహన శిబిరం నిర్వహిస్తున్నామని డాక్టర్ గోలి శ్రీధర్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఇందులో ఉచిత చెకప్, సాధారణ పరీక్షలు చేస్తామన్నారు. డైట్ కౌన్సిలింగ్‌లతో పాటు వైద్య సలహాలు ఉచితంగా ఇస్తామన్నారు. డయాబెటిక్ పేషెంట్స్‌కు అన్ని విధాలా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై పూర్తి అవగాహన కల్పిస్తామన్నారు. ఉదయం 8 నుంచి 12 గంటల వరకు శిబిరం ఉంటుందన్నారు. అవకాశాన్ని షుగర్ వ్యాధిగ్రస్తులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

కంటోన్మెంట్ అభివృద్ధికి నిధుల కేటాయింపుపై హర్షం

బొల్లారం, నవంబర్ 16: కంటోన్మెంట్ అభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం రూ.303 కోట్లు విడుదల చేసిన నేపథ్యంలో శనివారం పలువురు నాయకులు హర్షం వ్యక్తం చేశారు. కంటోన్మెంట్‌లోని తిరుమలగిరి, రసూల్‌పురా, బొల్లారంలో సంబురాలు జరుపుకొని స్వీట్లు పంచిపెట్టారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి, కంటోన్మెంట్ ఎమ్మెల్యే చిత్రపటాలకు క్షీరాభిషేకం చేశారు.

మారేడ్‌పల్లి: కంటోన్మెంట్ బోర్డు అభివృద్ధి కోసం రాష్ట్ర ప్రభుత్వం రూ.303 కోట్లు కేటాయించినందుకు సీనియర్ నేత తేలుకుంట సతీశ్‌గుప్త హర్షం వ్యక్త చేశారు. కార్యక్రమంలో నాయకులు నాగేందర్‌యాదవ్, మానిక్ ప్రభు, శ్రీనివాసులు, వేణు గోపాలచారి తదితరులు పాల్గొన్నారు.

'గాండ్ల తేలికుల కార్పొరేషన్ ఏర్పాటు చేయాలి'

ఖైరతాబాద్, నవంబర్ 16 : గాండ్ల తేలికుల సామాజికవర్గానికి ప్రభుత్వం ప్రత్యేక కార్పొరేషన్‌ను ఏర్పాటు చేయాలని అఖిల గాండ్ల తేలికుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు బిక్కుమళ్ల రాంచందర్ రావు కోరారు. ఖైరతాబాద్‌లోని సంఘం ఆఫీస్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ గాండ్ల తేలికులు వెనుకబడి ఉన్నారని, వారిని ప్రభుత్వం ఆదుకోవాలన్నారు. రెడ్డి గాండ్ల సామాజికవర్గానికి కొందరు అధికారులు గాండ్ల కుల ధ్రువీకరణ పత్రాలు ఇస్తున్నారని, వారితో తమ సామాజికవర్గానికి ఎలాంటి సంబంధం లేదని తెలిపారు.